
పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

పైపులైన్ పనులు వేగంగా పూర్తిచేయాలి: ఎమ్మెల్యే

మియాపూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట డివిజన్ బీహెచ్ఈఎల్ ప్రధాన గేటు నుంచి కల్వరి టెంపుల్ వద్ద ఉన్న రిజర్వాయర్ వరకు సుమారు రూ.40 కోట్లతో చేపడుతున్న పైపులైను పనులను సోమవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పరిశీలించారు. మంజీర రోడ్డులో జరుగుతున్న పైపులైను పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంజీర మంచినీటి పైపులైను నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. మంజీర రోడ్డులో పాత పైపులైను 1960లో నిర్మాణం చేయడం వల్ల లీకేజీలు ఏర్పడుతున్నాయన్నారు. దీని కారణంగా తాగునీరు రోడ్డు పాలు కావడంతో పాటు రోడ్లు దెబ్బదింటున్నాయని తెలిపారు. కాలనీవాసులు ఇబ్బందులను గుర్తించి కొత్త పైపులైన్ నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు.


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

హైదర్‌నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ కిందికుంట పార్కులో పిక్సిల్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. శిబిరంలో పాల్గొన్న వారికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్లు అబ్దుల్ రషీద్, కృష్ణ, పూజిత, షబ్బీర్, కిందికుంట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆదర్శనగర్‌లో తాగునీటి లీకేజీ

గచ్చిబౌలి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి డివిజన్ ఆదర్శనగర్‌లో తాగునీటి పైపులైను లీకేజీలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని కాలనీసంక్షేమ సంఘం అధ్యక్షుడు రామస్వామియాదవ్ సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజులుగా లీకేజీ అవుతుండడంతో తాగు నీరు అంతంత మాత్రంగానే సరఫరా అవుతుందని తెలిపారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాల ని పలుమార్లు అధికారులకు వినతిపత్రా లు ఇచ్చినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పం దించి లీకేజీలను అరికట్టి ప్రజలకు సక్రమంగా తాగునీరు అందించాలని ఆయన కోరారు.


రోడ్డుపై పారుతున్న తాగునీరు

ఘనంగా కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం

చందానగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట డివిజన్ పరిధిలోని హుడా కాలనీలోని వాసవి కన్యకాపరమేశ్వరి లలితానగరేశ్వర దేవాలయం ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రవికుమార్‌నాయి, సురేష్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్‌గుప్తా, కొండా విజయ్, కోటేశ్వరరావు, కృష్ణ, శ్రీను, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అందరినీ ఆదుకుంటుంది

అల్లాపూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల బాగోగులను కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కనిపెట్టుకుని ఉంటుందని ఆ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. సోమవారం ఆయన అల్లాపూర్ డివిజన్‌లోని బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్న పార్టీ కార్యకర్త మహ్మద్ షరీఫ్‌ను ఆయన నివాసంలో కలుసుకున్నారు. నాలుగేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న గతంలో షరీఫ్ వైద్య ఖర్చుల కోసం లెటర్ ఆఫ్ క్రెడిట్ అందజేశామని బండి రమేష్ పేర్కొన్నారు.


షరీఫ్‌ను పరామర్శిస్తున్న బండి రమేష్

ఉచిత నైపుణ్య శిక్షణా కోర్సులు

కుషాయిగూడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి మొదలుకొని డిగ్రీ విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతకు టెక్ మహీంద్రా ఫౌండేషన్, 'క్యాడర్' సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ బేసిక్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్, టైప్‌రైటింగ్, సాఫ్ట్ స్కిల్స్, ట్యాలీ అండ్ ఇంటర్వ్యూ స్కిల్స్ కోర్సుల్లో శిక్షణనిచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామని వారు వివరించారు. అభ్యర్థులు 18 నుంచి 27 ఏళ్లలోపు వయసు ఉండి, శిక్షణా కోర్సుల్లో ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఇతర వివరాలకై ఫోన్ 9100056583, 8885512037 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ

పేట్‌బషీరాబాద్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్‌లోని విజయనగర్ కాలనీ పోచమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకూ జరగనున్నట్లు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ పునఃప్రతిష్ఠ మహోత్సవంలో అమ్మవారి విగ్రహంతో పాటు ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠ జరుగుతుందని కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ రియాజ్, ప్రధాన కార్యదర్శి మల్లం శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

కాంగ్రెస్ సభను విజయవంతం చేయండి

దుండిగల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేష్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ఈ సమావేశం కొనసాగుతుందన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మల్కాజిగిరి నియోజకవర్గం ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

నిజాంపేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. డి.నవీన్(41) ప్రైవేట్ ఉద్యోగి. ప్రగతినగర్‌లోని చర్చి రోడ్డులోని సరానందిని ఎన్‌క్లేవ్‌లో ఉంటున్నాడు. ఈనెల 24వ తేదీన నేరేట్‌మెట్‌లోని తన సోదరుడు సురేష్‌వీర్ నివాసానికి వెళ్లి సాయంత్రం వచ్చాడు. అదే రోజు రాత్రి 7 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.


నవీన్

బాలాపూర్ పరిధిలో బాలుడు..

పహాడిషరీఫ్ మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలుడు ఇంటికి తిరిగిరాలేదు. ఈ ఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... షాజహాన్ కాలనీకి చెందిన ఎండీ ఫక్రుద్దీన్ కుమారుడు, మహమ్మద్ షహీబాజ్ అన్సారీ(15) ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రి అయిన తిరిగి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి ఫక్రుద్దీన్ సోమవారం బాలాపూర్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హోలీ సంబురాలు

జోన్‌బృందం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపల్, కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో సోమవారం హోలీ సంబురంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ వీధుల్లో తిరుగుతూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి కాముడి దహనం చేశారు.


గాజులరామారంలో హోలీ వేడుకల్లో చిన్నారులు


ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు


రాఘవేంద్రకాలనీలో హోలీ సంబరాల్లో చిన్నారులు


వెంకటపాపయ్య యాదవ్‌నగర్‌లో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటున్న చిన్నారులు


ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్‌కు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు, సంక్షేమ సంఘం సభ్యులు


హోలీ వేడుకల్లో అశ్వినీ కాలనీవాసులు


కాముని దహనం చేస్తున్న బతుకమ్మ బండవాసులు


కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న రాజీవ్‌గృహ లబ్ధిదారులు


హోలీ సంబురాల్లో జనం



హోలీ సంబురాల్లో ఫస్ట్ ఎవెన్యూ కాలనీవాసులు


జేఎన్‌టీయూ క్యాంపస్‌లో విద్యార్థులకు వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డి, రెక్టార్ ప్రొ.విజయకుమార్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు


ఫతేనగర్ డివిజన్ భరత్‌నగర్ కాలనీలోని పార్కులో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లోళ్ల నాగిరెడ్డి, సభ్యులు వేడుకల్లో పాల్గొన్నారు


కూకట్‌పల్లి బాలాజీనగర్‌లో హోలీ వేడుకల్లో చిన్నారులు


కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లో కామదహనం చేస్తున్న స్థానిక నాయకుడు చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాలనీవాసులు


శేరిలింగంపల్లికి చెందిన మైనార్టీ నాయకులు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఆయన ఇంట్లో సోమవారం కలిసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు.


హైదర్‌నగర్‌లో చిన్నారులతో కలిసి హోలీ సంబరాల్లో ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్


గచ్చిబౌలిలోని నల్లగండ్ల అపర్ణగ్రాండ్‌లో నృత్యాలు చేస్తూ రంగులు చల్లుకున్న కాలనీవాసులు


గచ్చిబౌలిలోని నిథమ్‌లో విద్యార్థులు, సిబ్బంది హోలీ ఆడుతూ సరదాగా గడిపారు

వైన్‌షాపులు క్లోజ్.. బెల్ట్ షాపులు ఓపెన్

(5వ పేజీ తరువాయి)

లోయర్ ధూల్‌పేట్, ఇందిరానగర్, గుఫ్రానగర్ తదితర ప్రాంతాల్లోని బెల్ట్‌షాపుల్లో పెద్దఎత్తున మద్యం విక్రయాలు జరిగాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు పెద్దఎత్తున అమ్మకాలు సాగాయి. బహిరంగంగా విక్రయాలు జరిపినా, ఆవైపు పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు కన్నెత్తి చూడలేదు. సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగరేణి కాలనీలో మద్యం ఏరులై పారింది. క్వాటర్ బాటిల్ మీద రూ.50 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేశారు. వీధుల్లోనే కొందరు మహిళలు పోటీపడి మరీ విక్రయాలు జరిపారు.

మత్తులో ఎక్సైజ్ అధికారులు

నగరంలోని పలుప్రాంతాల్లో వైన్‌షాప్ నిర్వాహకులే హోలీ వేళ.. బెల్ట్ షాపులను తెరిచారు. మద్యం విక్రయాలన్నీ ఆయా ఎక్సైజ్‌శాఖ అధికారుల కనుసన్నల్లోనే జరిగాయనే ఆరోపణలున్నాయి. నాచారంలోని ఓ వైన్‌షాపు నిర్వహకులు కూడా సమీపంలోని ఓ ఇంట్లో నుంచి విక్రయాలు జరుపగా, అంబర్‌పేట, ముషీరాబాద్‌లోనూ కొందరు వైన్‌షాపు నిర్వాహకులు అమ్మకాలు జరిపినట్లు తెలిసింది. లంగర్‌హౌజ్‌లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ యజమానే సమీపంలోని ఓ గోదాంలో మద్యం ఏర్పాటు చేసి జోరుగా విక్రయించినట్లు సమాచారం. అదేవిధంగా గచ్చిబౌలిలోని ఓ పబ్ నిర్వహకుడు కూడా ఓ వాహనంలో మద్యం అమ్మకాలు సాగించారు. ఇలా నగరం నలుమూలాల హోలీ వేళ.. మద్యం విక్రయాలు పెద్దఎత్తున జరిపారు.

వేసవిలో కుండనీరే శ్రేష్ఠం

- రోజురోజుకూ పెరుగుతున్న వేడి
- కూజలు, రంజన్‌లకు పెరిగిన గిరాకీ


రంజన్‌లను కొనుగోలు చేస్తున్న మహిళ

బాలానగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మార్చిలోనే వేసవి తీవ్రత ఎక్కువగా ఉంది. ఇప్పుడే ఎండ తీవ్రత ఇలా ఉంటే ఇక ఏప్రిల్, మేలో పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతుండంతో చల్లదనం కోసం ప్రజలు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ వేసవిలో తాగునీరు సహజ సిద్ధం గా చల్లగా ఉండేలా మట్టి కుండలు, రంజన్ల కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో పలు ప్రాంతాల్లో కుండలు, రంజన్లకు డిమాండ్ పెరిగింది. అదిలాబాద్, మహారాష్ట్ర, కోల్‌కత్తా, బిహార్, రాజస్థాన్ తదితర ప్రాంతాలలో తయారు చేసిన కుండలు, రంజన్లు, సురాయ్, కూజాలు, వివిధ సైజుల్లో తయారు చేసిన మట్టి పాత్రలు నగరానికి చెందిన వ్యాపారులు దిగుమతి చేసుకుని రోడ్లపక్కన పెట్టి విక్రయిస్తున్నారు. పేదల ఫ్రిజ్‌గా పిలువ బడే ఈ మట్టి కుండలను ఫ్రిజ్‌లు ఉన్నవారు, ధనికులు సైతం కొనుగోలు చేస్తున్నారు. పేదలు, ధనికులు సైతం మట్టి పాత్రలను కొనుగోలు చేస్తుండడంతో వేసవిలో గిరాకీ పెరుగుతోంది.

● అందుబాటు ధరలు

అదిలాబాద్, మహబూబ్‌నగర్ ప్రాంతాలలోని మట్టితో తయారు చేసిన రంజన్లకు మంచి గిరాకీ ఉంది. సైజును బట్టి రేట్లు ఉన్నాయి. కుండలు రూ.100 నుంచి 250 రూపాయల వరకు ఉండగా, కూజాలు రూ.75 నుంచి రూ.150 వరకు అమ్ముతున్నారు. ఇక రంజన్‌లు మాత్రం రూ.350 నుంచి రూ.400లకు పైగా ధర పలుకుతున్నాయి.

● కుండ నీటితో ఆరోగ్యం

ఫ్రిజ్‌లో నీరైనా.. కూల్‌డ్రింక్ అయినా మట్టి కుండలోని నీటికి సాటిరాదని వైద్యులు చెబుతున్నారు. మట్టి కుండ మనిషికి కావాల్సిన మేరకే చల్లదనం అందిస్తుంది. కుండలో నీటిని తాగడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావు. కానీ ఫ్రిడ్జ్‌లు, రిఫ్రిజిరేటర్ల వల్ల పర్యావరణానికి హాని కలిగించే క్లోరో కార్బన్లు విడుదలై ఓజోన్ పొరను దెబ్బతీస్తున్నాయని పర్యావరణవేత్తలు అంటున్నారు. ఫ్రిడ్జ్ నీటితో గొంతు సంబంధ వ్యాధులు రావొచ్చునని వైద్యులు సూచిస్తున్నారు. మట్టికుండలో నీటిని తాగితే దాహం తీరడంతో పాటు, శరీరాన్ని చల్లబరుస్తుందని తెలిపారు. అందుకే రోగాలు రాకుండా ఉండాలంటే కుండనీరే శ్రేష్ఠమని వైద్యులు చెబుతున్నారు.

యువకుడి ఆత్మహత్య

రాజేంద్రనగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మానసిక వేదనతో బాధపడుతున్న ఓ యువకుడు ఆదివారం రాత్రి అత్తాపూర్ హుడా కాలనీ శ్మశానవాటికలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. రాజేంద్రనగర్ సర్కిల్ సిక్‌చావునీ ప్రాంతానికి చెందిన హర్జీత్‌సింగ్, హర్విందర్ కౌర్‌లకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మన్‌ప్రీత్ సింగ్‌కు ఇటీవలనే ఓ హత్య కేసులో ఐదు సంవత్సరాల శిక్ష పడింది. అతడు జైలులో ఉన్నాడు. చిన్న కుమారుడు జస్ప్రీత్ సింగ్(19)కు నిషా పీల్చే అలవాటు ఉంది. వైట్‌నర్ లాంటివి పీలుస్తు మత్తులో ఉంటాడు. ఇటీవల అన్న మన్‌ప్రీత్‌సింగ్ జైలుకు వెళ్లడంతో మానసికంగా కృంగిపోయాడు. దానికి తోడు నిషా పీల్చే అలవాటు ఉండటంతో ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన జస్ప్రీత్ సింగ్ హుడా కాలనీ శ్మశానవాటికకు వెళ్లి చెట్టుకు తలపాగాతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం మధ్యాహ్నం చూసిన స్థానికులు అత్తాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి వివరాలు సేకరించారు. ఆత్మహత్య చేసుకుంది జస్పీర్ సింగ్‌గా గుర్తించి వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

అనారోగ్యంతో వ్యక్తి

మదీన: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ గురునాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రయ్య(45) మేస్త్రీ. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేశవగిరి గుట్టపైన అద్దెకుంటున్నాడు. మద్యానికి బానిసై కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు, ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కిస్మత్‌పూర్ రాక్‌చర్చిలో ఈస్టర్ ఆరాధనలు

రాజేంద్రనగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కిస్మత్‌పూర్‌లోని రాక్ చర్చి క్యాంపస్‌లో ఈ నెల 31న ఈస్టర్ ఆరుణోదయ ఆరాధనలు నిర్వహించనున్నట్లు మన్నా మినిస్ట్రీస్ సహ వ్యవస్థాపక అధ్యక్షురాలు బిషప్ రేచల్ జ్యోతి కొమానపల్లి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి జరిగే ప్రార్థనలలో పాస్టర్ సత్యప్రకాశనంద బైబిల్ సందేశాన్ని అందజేస్తారన్నారు.

స్వర్ణనంది పురస్కారాలు ప్రదానం

రవీంద్రభారతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతిభను గుర్తించి పురస్కారాలతో సత్కరించడం వలన వారిని మరింత ఉత్సాహంగా పనిచేసేలా చేస్తుందని తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా అన్నా రు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో నిష్ణాతులైన పలువురికి స్వర్ణ నంది పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కోలేటి దామోదర్ గుప్తా పురస్కార గ్రహీతలను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత్ ఆర్ట్స్ అకాడమీ విభిన్నమైన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కళాకారులను ప్రోత్సహించే విధంగా స్వర్ణ నంది పేరిట పురస్కారాలు ప్రదానం చేయడం సంతోషకరమని అన్నారు. కళలు, కళాకారులను అండగా నిలవాల్సిన అవసరముందని అన్నారు. ప్రభుత్వంతో పాటు సాంస్కృతిక సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ మాట్లాడుతూ నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేయడంతో పాటు నాట్య గురువులను సత్కరించుకోవడం అభినందనీయమని అన్నారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ సంస్థ రికార్డు స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించడం ఆనందకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు రమణారావు, లలితారావు, జ్యోతిరెడ్డి, నటులు విష్ణుప్రియ, సిద్ధార్థ్, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు


అయ్యప్పస్వామికి పడిపూజ నిర్వహిస్తున్న ప్రసాద్ గురుస్వామి, భక్తులు

చందానగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి జన్మనక్షత్రం సందర్భంగా చందానగర్ పీజేఆర్ ఎన్‌క్లేవ్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో భక్తులు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు చేశారు. ఉదయం స్వామివారికి పంచామృత, అష్టద్రవ్యాలతో అష్టోత్తర శత కలశములతో కనకాభిషేకం, గణపతి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం వేంకటేశ్వరస్వామి సేవాసమితి అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం తైలాభిషేకంతో పాటు ప్రసాద్‌గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీసత్యనారాయణ, రవి, రామచంద్రరావు, డి.శ్రీనివాసరావు, జ్యోతిశ్రీనివాస్, శివారెడ్డితో పాటు అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పూజలు

ఫతేనగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ పరిధిలోని శివాలయంలో అయ్యప్ప ప్రత్యేక పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఉత్తర నక్షత్రం పుట్టిన రోజు సందర్భంగాఅయ్యప్ప సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజల్లో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌తో అయ్యప్ప సేవాసమితి సభ్యులు